

బిఇడి 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

- 96.92 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బిఇడి కళాశాలల నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్ ఈశ్వర్‌రెడ్డితో కలిసి శుక్రవారం విడుదల చేశారు. ఈ ఏడాది జులై నిర్వహించిన బిఇడి పరీక్షల్లో 2,367 మంది హాజరు కాగా 2,294 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 96.92 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. త్వరితగతిన మూల్యాంకన ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు విడుదలకు కృషిచేసిన పరీక్షల విభాగాన్ని విసి ప్రశంసించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ సుమిత్ర పాల్గొన్నారు.

పిహెచ్‌సి పోస్టుల కౌన్సెలింగ్‌లో

గందరగోళం

- సిహెచ్‌ఒ వర్సెస్ ఎంపిహెచ్‌ఇఒల వాగ్వాదం
- రేషియో అంశంపై బాయ్‌కాట్‌ల పర్వం
- రాష్ట్ర డైరెక్టర్ జోక్యంతో సర్దుబాటు
- వేకెన్సీ జాబితాపై సర్వత్రా చర్చ



కౌన్సెలింగ్‌లో అధికారులను నిలదీస్తున్న ఎంపిహెచ్‌ఇఒలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పిహెచ్‌సి పోస్టుల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో రెండ్రోజులుగా 143 జిఒ అమలులో భాగంగా జోన్-4 పరిధిలోని ఉమ్మడి కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం, జిల్లాలోని 630 పిహెచ్‌సిల్లో 14 మంది ఉద్యోగుల నియామకం ప్రకారం కౌన్సెలింగ్ చేపడుతున్న సంగతి తెలిసిందే. రెండోరోజైన శుక్రవారం సాయంత్రం 220 సిహెచ్ఒ, ఎంపిహెచ్ఇఒ పోస్టుల రేషియో అమలు అంశంపై గందరగోళం నెలకొంది. ఒక సిహెచ్‌ఒతోపాటు ఇద్దరు ఎంపిహెచ్‌ఇఒలను రేషియో కౌన్సిలింగ్ పిలవాల్సిన నేపథ్యంలో కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందే సిహెచ్‌ఒలను ఆప్షన్స్ నిర్ధారించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. మొదటి ఆప్షన్ అమలు చేయడంతో సీనియర్లు అయిన సిహెచ్‌సిలకే ప్రాధాన్య పోస్టులు లభించే అవకాశం ఉందని, మిగిలిన అప్రధ్యాన్య పోస్టులకు ఎంపిహెచ్‌ఇఒలను పరిమితం చేయడం పట్ల వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి ఎంపిహెచ్‌ఇఒలు, సిహెచ్‌సి తమ పంతమే నెగ్గాలనే ధోరణితో పరస్పరం భాయ్ కాట్‌లు చేసుకోవడం ఉత్కంఠను కలిగించింది. ఆర్‌డి రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉన్నతాధికారిని సం ప్రదించడంతో వారి సలహా మేరకు సిహెచ్‌ఒలకు ప్రాధాన్యత ఇచ్చి కౌన్సెలింగ్ కొనసాగించారు. చేసేదేమీ లేకపోవడంతో మిగిలిన అప్రధాన్య పోస్టులకు సిహెచ్‌సి, ఇద్దరు ఎంపిహెచ్‌ఇఒలు కౌన్సిలింగ్‌కు హాజరు కావడం గమనార్హం. సహజంగానే సిహెచ్‌ఒలు సీనియర్లు ఉండడం అందరికీ తెలిసిందే. సీనియారిటీ ప్రాతిపదికన సిహెచ్‌ఒలను పిలిచి ఎక్కడికి వెళ్తారని అడిగిన తర్వాత కౌన్సెలింగ్ కొనసాగించారు. రెండవ రోజు కౌన్సిలింగ్ సమయంలో కూడా వేకెన్సీ పోస్టుల జాబితాలను వెల్లడించ కుండానే, అప్పటికప్పుడు వేకెన్సీలను చూసుకుని కౌన్సిలింగ్ నిర్వహించడమేమిటనే అంశం చర్చనీయాంశమైంది.

క్విజ్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత

ప్రజాశక్తి-కడప



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ పి.రవి శేఖర్, సుబ్బారావు

క్విజ్ నిర్వహణ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత ఏర్పడుతుందని జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. రవిశేఖర్ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల జంతు శాస్త్ర శాఖ, క్విజ్ నిర్వాహక అధికారి, నెల్లూరు లైన్ క్లబ్ అధ్య క్షులు సుబ్బారావు సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'ఇన్నోవేటివ్ టెక్నాలజీ' అనే అంశం పై క్విజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జంతు శాస్త్ర విభాగాధిపతి మాట్లాడుతూ ఇటువంటి క్విజ్‌లను నిర్వహించడం వల్ల విద్యా ర్థులలో ఏకాగ్రతను పెంచడమే కాకుండా అధునాతన విజ్ఞానం పట్ల విద్యార్థుల దృష్టిని కేంద్రీకరించడానికి ఉపయోగపడతాయని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వైస్. సావిత్రి మాట్లాడుతూ ఇటువంటి క్విజ్ లను నిర్వహించడం వల్ల చేయడం ద్వారా విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్నటువంటి ప్రజ్ఞను వెలికి తీయొచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు పతకాలు, సర్టిఫి కెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి. నాగేంద్ర కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

కడప అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు ఎస్‌పి అన్బురాజన్ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. ఎఆర్ఎస్ఐ కె.రామమోహన్ కుటుంబానికి ఎస్‌పి రూ.2.25 లక్షల చెక్కును అందజేశారు. అలాగే ప్రొద్దుటూరు వన్ టౌన్‌లో ఎఎస్ఐగా గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన టి.సుదర్శన్ సతీమణి టి.సువర్ణకు రూ.2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు ఇచ్చారు. వాటర్ బాయ్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మరణించిన పి.రెడ్డెయ్య సతీమణి పి.తులశమ్మకు రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం చెక్కు రూపంలో పంపణీ చేశారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువులకు, కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్ పాల్గొన్నారు.

రేపు ముస్లిం ఐక్యవేదిక సమావేశం

ప్రజాశక్తి- కడప అర్బన్



ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న సలావుద్దీన్

గుంటూరులో ఈనెల 27న నిర్వహించనున్న ముస్లిం ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం పలువురు ముస్లిం నాయకులను మహాసభల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి దాదాపుగా వివిధ పార్టీలకు చెందిన 200 మందిని వ్యక్తిగతంగా కలిసి ఆహ్వాన పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మత పెద్దలు కలిసి గుంటూరులో ముస్లిం ఐక్యవేదిక సమావేశాన్ని విజయవంతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లింలు, మేధావులు హాజరై విజయవంతానికి పిలుపునిచ్చారు. సమావేశంలో ముస్లింల ఎదుర్కొంటున్న సమస్యలు, రాజకీయ పార్టీలు అవలంబిస్తున్న ముస్లిం వ్యతిరేక విధానాలను చర్చించి తమ హక్కుల కోసం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

వైవీయూలో భూగర్భజలాల అన్వేషణ

కడప అర్బన్ : విశ్వవిద్యాలయం గురుకుల భవన సముదాయం ఆవరణలో శుక్రవారం భూగర్భ జల అన్వేషణ జియాలజీ శాఖ నిర్వహించింది. విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింత సుధాకర్ సమక్షంలో నీటి వనరులు ఉన్న ప్రాంతాన్ని సాంకేతికపరంగా పరిశీలించారు. గురుకుల ఆవరణలో భూగర్భ శాఖ నిర్ణయించిన ప్రాంతంలో పరీక్షల కోసం బోర్లు వేయిస్తామని తెలిపారు. ఈ అన్వేషణలో ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, జియాలజి విభావాధిపతి ఆచార్య రఘు బాబు, ఆశ్చర్య సునీత, ఆచార్య ఎన్. జయరాజు, డాక్టర్ శ్రీనివాస గౌడ్, డాక్టర్ ఆర్. సిద్దిరాజు, ప్రజా సంబంధాల సంచాలకులు డాక్టర్. ఎస్.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మూడో స్థానంలో ఎపి ఉద్యోగుల జట్టు

కడప : ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఈనెల 22 నుంచి 5వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించిన హాకీ టోర్నమెంట్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్లో కలకత్తా మొదటి స్థానాన్ని, తమిళనాడు రెండవ స్థానాన్ని, ఆంధ్రప్రదేశ్ మూడో స్థానాన్ని కైవశం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డ్ తరఫున వైఎస్ఆర్ జిల్లా నుండి మీరావలి, కరీం, రామకృష్ణ, శివ, శ్రీధర్ పాల్గొన్నారు.

జిపిఎస్‌ను అంగీకరించే ప్రసక్తేలేదు

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

జిపిఎస్‌ను అంగీకరించే ప్రసక్తే లేదని ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌టియు భవన్‌లో నిర్వహించిన పోరుమామిళ్ల రీజియన్ పరిధిలోని ఎస్‌టియు కార్యకర్తల సమావేశంలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే సిపియస్ ను రద్దు చేసి, ఒపిఎస్ ను అమలు చేస్తామని చెప్పి,ఇ పుడు ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను తీసుకురావడం లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనన్నారు. బలవంతంగా జిపిఎస్‌ను అమలు చేయాలని చూస్తే సమ్మెకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య రాష్ట్ర నాయకులు బాలరాజు, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, జిల్లా నాయకులు కుళ్లాయప్ప, శివారెడ్డి, నారాయణరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి జిల్లా,మండల నాయకులు పాల్గొన్నారు. **ఎస్‌టియులోకి చేరిక..** ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో పోరుమామిళ్ల , బద్వేలు ప్రాంతంలోని ఇతర ఉపాధ్యాయ సంఘాలకు చెందిన ముఖ్యనేతలు ఎం.శేఖర్ బాబు, ఎం. రామసుబ్బయ్య, బి.ఎన్.వి.ప్రసాద్, కె.సత్యనారాయణ, వై.నాగిరెడ్డి చేరారు.

జ్ఞానానికి మూలం యోగా

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యువ ఆచార్య చందులూరు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో యోగా తరగతులకు సంబంధించి నవచేతన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా యోగ ప్రాముఖ్యతను, ప్రాణాయామం ,ధ్యానం గురించి క్షుణ్ణంగా వివరించి సాధన చేయించారు. క్రమం తప్పకుండా ప్రతి నిత్యం సాధన చేస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో యోగా ప్రముఖ పాత్రను వహిస్తుందని చెప్పారు. భౌతిక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో యోగాకు మించిన మార్గం ఇంకొకటి లేదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కె.రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని ప్రతినిత్యం యోగసాధన చేసుకుంటూ భౌతిక మానసిక రుగ్మతలను తొలగించుకొని ఏకాగ్రతను పెం పొందించుకుని చదువులో మొదటి స్థానాన్ని సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మహమ్మద్ రఫీ, రాజేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుట్టినరోజు వేడుకలు చేసుకుంటున్న వికాస్ హరికృష్ణ

ఘనంగా వికాస్ హరికృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కడప

వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉదయగిరి నియోజకవర్గ టిడిపి పరిశీలకులు, వికాస్ హరికృష్ణ జన్మదిన వేడుకలను శుక్రవారం కడప నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కడప నగరం 45వ డివిజన్ ఊటుకూరులో గంగాధర్ రెడ్డయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దుపట్టాతో వికాస్ హరికృష్ణ ను సత్కరించి, కేక్ కట్ చేసిశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి పార్టీ అభ్యున్నతికి కష్టపడుతూ తనకు తోడుగా ఉంటూ అన్ని విధాల అండగా ఉంటున్న కార్యకర్తలకు స్నేహితులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక అక్కాయపల్లెలోని వికాస్ స్కూల్‌లోనూ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో 22,44,46,47 డివిజన్ల ఇన్‌ఛార్జులు పి.శ్రీనివాసులు, ఖాజపీర్, భరత్ ,జనర్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

30 నుంచి సచివాలయాల వద్ద

ఆందోళనలు : సిపిఎం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య, మధ్య తరగతి ప్రజలు చేస్తున్న మోసాలకు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సచివాలయాల వద్ద ఆందోళనలు, ప్రజాభిప్రాయ సంతకాలు సేకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నామని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో ఆందోళనలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి కొచ్చిన ఈ తొమ్మిదేళ్లల్లో ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. లక్షల సంఖ్యలో నిరుద్యోగులు ఇతర దేశాలకు వసల వెళ్లడం సిగ్గుచేటని వాపోయారు. ప్రజలను చైతన్య పరిచేందుకే కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో శేఖర్ లక్ష్మయ్య, పవన్, బాష, పుల్లయ్య పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ఎస్ఎఫ్ఐ స్కూటర్ యాత్ర ప్రారంభంలో నాయకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



స్కూటర్ యాత్ర ప్రారంభంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర' ను కోదండ రామాలయం సర్కిల్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒంటిమిట్ట, సిద్ధవటం బద్వేల్, కాశినాయన పోరుమామిళ్ల, మైదుకూరు జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ తరఫున విద్యార్థుల సమస్యలపై పోరాతున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేస్తోందని ఆవేనద వ్యక్తం చేశారు. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడలేని విధంగా జగన్ ప్రభుత్వం మెడి కల్ కళాశాలలో సీట్లు అమ్ముకునేలా జీవో నెంబర్ 107,108, తీసుకొని వచ్చిందని పేర్కొన్నారు. ఇంటర్‌లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభు త్వమే ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయాలని తెలి పారు. మధ్యాహ్న భోజనం పథకం ఇంటర్ విద్యా ర్థులకు కూడా అమలు చేయాలన్నారు. అనం తరం హాస్టల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తనిఖీ చేశారు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గండి సునీల్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు, రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి, రవి, జిల్లా కమిటీ సభ్యులు అజయ. సిపిఎం జిల్లా వ్యసాయ కార్మిక ఉపా అధ్యక్షులు నరసయ్య పాల్గొన్నారు.



షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటి పూజా హెగ్డే

నగరంలో పూజా హెగ్డే సందడి

- సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 32వ బ్రాంచ్ కడప నగరంలోని ప్రారంభించేందుకు ప్రముఖ హీరోయిన్ పూజా హెగ్డే శుక్రవారం కడపకు విచ్చేశారు. ప్రారంభోత్సవ సందర్భంగా పూజా హెగ్డే సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ కడపలో ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్ సురేష్ సీర్ణ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు అత్యాధునిక నాణ్యమైన వస్త్రాలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. మహిళలకు నచ్చే విధంగా అన్ని రకాల ఫ్యాన్సీ చీరలు, లెహంగాస్, చుడిదార్స్, లెగ్గిన్స్, జేగ్గిన్స్, కిడ్స్ వేర్, మెన్స్ వేర్ ఏర్పాటు మహిళలకు అన్ని శుభకార్యాలలకు అవసరమయ్యే పోచంపల్లి, మంగళగిరి, కంచి ధర్మవరం ఉప్పాడ సొంతమగ్గలపై తయారు చేసిన పట్టు చీరల కలెక్షన్ ఒక సౌత్ ఇండియా షాపింగ్ మాల్ కే సొంతం అన్నారు. జిల్లా ప్రజలు ఒకసారి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సందర్శించి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్లు, సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో శ్రీనారాయణి ఆస్పత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న వైద్యులు భార్గవ్, చరిష్మా

నగరంలోని నాగరాజుపేటలో శ్రీ నారాయణి హాస్పిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయని మేయర్ సురేష్ బాబు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి అన్నారు శుక్రవారం శ్రీనారాయణి కేర్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా ఆస్పత్రిని ఏర్పాటు చేశారని తెలిపారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ వైద్యాన్ని అందించేందుకు ఎంతో ఇష్టపడి కడపలో హాస్పిటల్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందించాలని ముందుకు వచ్చిన డాక్టర్ డాక్టర్ భార్గవ్ రామ్‌ను అభినందించారు. అనంతరం పోసినపల్లి డాక్టర్ చరిష్మా మాట్లాడుతూ స్త్రీలకు సంతానం లేని వారి కోసం ప్రత్యేక చికిత్స ఉందన్నారు. సులభ కాన్పులకు వైద్యం చేయడానికి తమ ప్రత్యేకత అన్నారు. గర్భిణులకు నొప్పులు రాకున్న నొప్పులు తెప్పించి కాన్పు చేయిస్తామని చెప్పారు. బటన్ హోల్, అన్ని రకాల ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. డాక్టర్ భార్గవ్ రామ్ మాట్లాడుతూ ఎంబిబిఎస్ ఉస్మానియాలో, డిఎన్‌బి ఢిల్లీలో చేశానని చెప్పారు. డెర్మటాలజీ సంబంధించిన వ్యాధులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ఫొటో థెరపీ లేజర్ చికిత్స చేస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, రాజకీయ నాయకులు, నగర ప్రముఖులు, డాక్టర్లు పాల్గొన్నారు.

ముల్లా జానీకి సన్మానం

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణంలోని జామియా మసీదులోశుక్రవారం మధ్యాహ్నం జుమ్మా నమాజు అనంతరం జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి, గురువులు సయ్యద్ షా అసద్ పాషా ఖాద్రిల ఆధ్వర్యంలో మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ ముల్లా జానీని కాశ్మీర్ శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జామియా మసీదు పీఠాధిపతి మాట్లాడుతూ జమ్మలమడుగు మున్సిపాలిటీలోని ప్రముఖ ముస్లిం నాయకుడు, కౌన్సిలర్ ముల్లా జానీ, ఆయన తల్లి కౌన్సిలర్ ముల్లా నూర్జహాన్ ఇటీవల గల్ఫ్ దేశంలోని పవిత్ర మక్కా, మదీనా దేశాన్ని సందర్శించి ఉమ్రా యాత్ర చేశారని చెప్పారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు మున్సిపాలిటీలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారని చెప్పారు. ఈ సందర్భంగా ముల్లా జానీని, ఆయన తల్లిని అభినందించి ఘనంగా సన్మానించారు. పట్టణంలో ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, ప్రభుత్వ నాయకులతో సంప్రదించి వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గురువులు, జామియా మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ముల్లా జానీని సన్మానిస్తున్న మసీదు పీఠాధిపతి

'పసుపు' అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయించాలి

కడప అర్బన్ : మైదుకూరు పసుపు కొనుగోలులో చోటు చేసుకున్న అక్రమాలు అవినీతిపై కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావును విచారణ కమిటీ నియమించారని, ఈ కమిటీ పట్ల చాలా అనుమానాలు, అపోహాలు ఉన్నాయని, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిచే విచారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి తెలిపారు. శుక్రవారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1500 బస్తాలు బహిరంగ మార్కెట్లో దాదాపు రూ. 8,000 పైగా అమ్మారని, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.6850 రైతుల ఖాతాలో వేయకుండా నగదు రూపంలో ఏ రకంగా చెల్లించాలని ప్రశ్నించారు. డిసిఎంఎస్, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ల అండదండలతోనే పసుపు కొనుగోలులో అవినీతి అక్రమాలు జరిగాయని సమగ్ర విచారణకు ఏపీ రైతు సంఘం కడప జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. నాసిరకం పసుపు కొనుగోలు చేశారని, వాటిని గోడౌన్స్ పంపిన తర్వాత తిరస్కరణకు గురైందని పేర్కొన్నారు. ఆ పసుపును 1500 బస్తాలను డిసిఎంఎస్ అధికారులు రైతులకు చేర్చాల్సిన బాధ్యత ఉందని, వాటిని తిరిగి ఇవ్వకుండా, రైతులకు తెలియకుండా అమ్ముకోవడం చాలా అన్యాయమని తెలిపారు. నిష్పక్షపాతంగా విచారించి రైతులను మోసం చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

'తుమ్మపూడి' మృతి సాహిత్య రంగానికి తీరని లోటు

కడప అర్బన్ : ప్రసిద్ధ సాహితీవేత్త, విమర్శకాగ్రేసరులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శుక్రవారం ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆచార్య తుమ్మపూడి కవిగా, విమర్శకుడుగా, అనువాదకుడుగా, నాటకకర్తగా అందించిన సేవలు చిరస్మరణీయమైనవన్నారు. ఆయనకు శ్రీకృష్ణదేవరాయలంటే చాలా అభిమానమని, అందువల్లనే 'ఆముక్తమాల్యదా సౌందర్యం' అనే అంశంపై పరిశోధించడమేకాక శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యదకు సౌందర్యలహరీ అనే పేరుతో వ్యాఖ్యానాన్ని కూడా రచించారన్నారు. కార్యక్రమంలో సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, సిబ్బంది పి.చంద్రకిశోర్, హరికృష్ణ, అరుణ, పాఠకులు శ్రీనివాసులు, రామలింగప్ప, సుబ్బరాయుడు, హరి, వెంకటరమణ, అనిల్ పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు జాతీయ స్థాయి ఉద్యమం

కడప అర్బన్ : కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు మరచిందని, ఆంధ్ర రాష్ట్ర హక్కులకై జాతీయ స్థాయి ఉద్యమం చేపడతామని జాతీయ సదస్సులో తీర్మానించినట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరణాల.శివకుమార్ తెలిపారు.విజయవాడలో జాతీయ సదస్సుకు కడప జిల్లా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విభజన హామీలను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ముఖ్యంగా కడప ఉక్కు పరిశ్రమ ఇస్తామని చట్టబద్ధంగా రాసుకున్నా ఏర్పాటు చేయడంలో బిజెపి నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ వేస్తే రాయలసీమలో చదువుకున్న ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల ఉద్యోగాలు లభిస్తయని చెప్పారు. కడప ఉక్కు కోసం, విభజన హామీల అమలు కోసం జాతీయ స్థాయి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, ఉద్యోగ పోరాట కమిటీ నాయకులు సిద్ధికి,కడప నగర అధ్యక్షుడు షాకీర్,జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, నాయకులు సురేష్, సురేంద్ర, ఆంజనేయులు, ఉదయ్, సూరి, రాఘవా, రాజు పాల్గొన్నారు.

నేడు న్యాయ సేవాసదన్ భవన్‌లో సమావేశం

కడప : జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ భవన్‌లో ఈనెల 26 న ఉదయం 11 గంటలకు ప్రజా వినియోగిత సేవలు సంబంధించి వివిధ శాఖల అధికారులతో అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి జి. గీత, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.



చీనీ చెట్లను పరిశీలిస్తున్న డ్వామా పీడీ యధుభూషన్‌రెడ్డి

పండ్ల తోటల పెంపకానికి ప్రత్యేక ప్రణాళికలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జిల్లాలో పండ్ల తోటలు పెంపకానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అంకాలమ్మ గూడూరు, గురజాల గ్రామాలలో పండ్ల మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3 వేల ఎకరాలలో పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టామన్నారు. సన్న, చిన్న కారు రైతులు తమ పొలాల వెంబడి నాటడానికి ఆసక్తి ఉన్న ప్రతి రైతుకూ ఉపాధి హామీ చట్టం ద్వారా అవకాశం ఉందన్నారు. గట్ల వెంబడి టెంకాయ, టేకు, ఎర్రచందనం నాటడం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, పండ్ల తోటల పెంపకం సూపర్‌వైజర్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.



పక్కా గృహాలకు నోచని ఎస్‌టి కాలనీ

అభివృద్ధికి నోచని నెర్రవాడ ఎస్‌టి కాలనీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని బద్రిపల్లె పంచాయతీలో నెర్రవాడ గ్రామ సమీపాన ఉన్న ఎస్‌టి కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. యానాది, ఎరుకల సంతతికి చెందిన 20 కుటుంబాల వారు 23 ఏళ్లకు పైగా ఇక్కడ నివాసం ఉంటున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి రోడ్లు, గృహాలు మంజూరు చేయకపోవడంతో పూరి గుడిసెలోనే నివాసం ఉంటున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఈ కాలనీలో వెచ్చించి అభివృద్ధి చేయాలని పలుమార్లు అధికారులు నివేదికలు సిద్ధం చేసినప్పటికీ ఆచరణలో అమలు కావడంలో విఫలమయ్యాయి. టిడిపి ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఆ కాలనీలోనే అభివృద్ధి పరచాలని ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. అయితే నెర్రవాడ ఎస్‌టి కాలనీ ఆ నిధులకు నోచుకోలేదు. దీంతో నేటికీ అభివృద్ధికి దూరంగానే ఉంది. వృత్తి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదరణ లేదు. గతంలో విద్యుత్ సరఫరా కూడా లేక నానా అవస్థలు పడే వారు. కాలనీ అభివృద్ధికి నోచుకోక కంప చెట్ల మధ్య ఉంది. ఇటీవల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంట్ సౌకర్యం మాత్రం కల్పించారు. కాలనీ సమీపంలో జగనన్న కాలనీ నిర్మాణం అవతోంది. పేదలకు స్థలం మంజూరు చేసి గృహాలు నిర్మిస్తున్నారు. నూతన కాలనీతో పాటు ఎస్‌టి కాలనీని అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పట్టణంలోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవమూర్తి మదర్ థెరిసా 113వ జయంతిని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాల వేసి రాజీవ్ సర్కిల్‌లో ఉన్న ఎన్‌జిఒహోమ్‌లో ప్రొద్దుటూరు పట్టణంలో డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరుస్తున్న వంకం సాయి హర్షితకి ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున సన్మానిస్తామని పేర్కొన్నారు. అనంతం ముఖ్య అతిథి, విశిష్ట అతిథుల సమక్షంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రక్తదాతలు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

వల్లూరు : గ్రామీణ పేదలకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ కె.నవీన్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు వల్లూరు ఉన్నత పాఠశాలలో కడప నగరానికి చెందిన కెఎన్ఆర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ డి. విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండల ప్రజలకు ఉచితంగా బిపి, షుగర్, థైరాడ్, విషజ్వరాలు, మలేరియా ,డెంగీ, టైఫాయిడ్, కిడ్నీ, పక్షవాతం, కామెర్లు మొదలగు వ్యాధులను ఉచితంగా చూస్తామన్నారు. గర్భిణులకు వైద్య పరీక్షలు హైరిస్క్ ప్రెగ్నెన్సీ ,సంతాన సాఫల్య కొరకు ప్రత్యేక చికిత్స ,గర్భకోశ సమస్యలు, ఉచితంగా చూస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల- ప్రొద్దుటూరు ప్రధాన రహదారిలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణం హోమస్‌పేటకు చెందిన విజయ భాస్కర్ (43), అతని బంధువు వెంకటేశ్వర్లు(70) కలిసి ద్విచక్ర వాహనంలో ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. ఎర్రగుంట్ల సమీపంలోని భవాని గోడౌన్ దగ్గరకు రాగానే ఎదురుగా వస్తున్న మినీ లారీ బలంగా ఢీకొనింది. ప్రమాదంలో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటా హుటినా సంఘటన స్థలానికి చేరుకొని, మృతుల బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఘర్షణలో గాయపడిన వారి పరిస్థితి విషమం

ప్రజాశక్తి- వేంపల్లె

మదీనాపురంలో జరిగిన స్థల వివాదం ఘర్షణలో ప్రత్యర్థుల చేతిలో కత్తి పోట్లుకు గురైన చిన్న ఖాసిం, ఉమర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. ఘర్షణలో చిన్న ఖాసిం, ఉమం కడుపుకు కత్తి పోట్లు తగలడంతో కడప రిమ్స్‌లో చికిత్సలు చేస్తున్నారు. చిన్న ఖాసిం అనే వ్యక్తి కడుపు భాగంలో కత్తి లోతుగా దిగడంతో వైద్యులు అపరేషన్ చేసి ప్లీహం భాగాన్ని తొలగించినట్లు బంధువులు చెప్పారు. ఉమర్‌కు కూడ వైద్యులు అపరేషన్ చేయాలని చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఉమర్ అనే వ్యక్తికి పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడూ మాజీ ఎంపిటిసి గంగరాజు ఆరా తీస్తు మెరుగైన వైద్యం కోసం వైద్యులతో చర్చిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

నాటు సారా స్వాధీనం : ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-లింగాల

మండల పరిధిలోని ఇప్పట్ల లోనాటు సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐరవికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన మోహన అనే వ్యక్తి గ్రామ సమీపంలోని కొండల ప్రాంతంలో నాటు సారా తయారుచేసి పులి వెందులకు తరలిస్తుండేవాడని, శుక్రవారం తమకు వచ్చిన సమాచారం మేరకు ఇప్పట్ల గ్రామ సమీపంలో దాడులు నిర్వహించామని చెప్పారు. పది లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

అడుగంటిన భూగర్భ జలాలు

వర్షాభావంతో బోరు బావుల్లో నీరు రాక రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

చినుకు రాలక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయని రైతుల్లో ఆందోళన నెల కొంది. వర్షాలు పడకపోవడంతో వంకలు, వాగులు ఎండిపోయాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. బోర్లల్లో నీరు రాక ఉద్యాన పంటలు సాగు చేసిన రైతుల్లో ఆందోళన మొదలైంది. గత ఏడాది సమృద్ధిగా వర్షాలు పడడంతో చెరువులు, వాగులు నిండుగా ప్రవహించాయి. భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. అయితే ఈ ఏడాది పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు పడినా పదును కాలేదు. భూగర్భ జలాలు కూడా పెరగలేదు. లింగాల మండలంలో చిత్రావతి రిజర్వాయర్ నుంచి ఎడమ, కుడి కాలువల ద్వారా నియోజక వర్గంలోని సింహాద్రిపురం, లింగాల, పులివెందుల, తొండూరు, వేములలోని చెరువులను నింపారు.



సాగునీటి కోసం బోర్లు వేస్తున్న రైతులు

ఇలా చేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గలేదు. చిత్రావతి రిజర్వాయరులో పుష్కలంగా నీరు ఉన్నా, ఈ ఏడాది చెరువులు, కుంటలను నింప లేకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. రైతులు తమ పంటను కాపాడుకోవడానికి బోర్లు వేస్తున్నారు. చిత్రావతి కుడి, ఎడమ కాలువకు నీరు వదిలినా కాలువలకు సిమెంటు వేయడం వలన నీరు ఇంకి పోవడంలేదు. ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాలు పెద్దగా పెరగడం లేదు. బోరు బావుల్లో నీరు దగ్గడంతో రైతులు తమ పంటను కాపాడు కోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు.

అటకెక్కిన వైఎస్ఆర్ జల ప్రవంతి

ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు ప్రభుత్వం వైఎస్ఆర్ జలప్రవంతి పథకం కింద ఉచితంగా బోర్లు వేసేవారు. ఈ పథకం ప్రస్తుతం అటకెక్కడంతో రైతులు సొంత డబ్బుతో బోర్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది రైతులకు మరింత భారమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైఎస్ఆర్ జలప్రవంతి పథకానికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

'సీమ'కు మోసం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలి

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమ ప్రాంత వాసులకు నవ మోసాలు చేసిన బిజెపి, వైసిపి, టిడిపిలకు రాబోవు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి చెప్పారు. శుక్రవారం వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పులివెందుల అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం సమన్వయ కమిటీ కన్వీనర్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి హాజరైనారు. ఈసందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ, సిఎం జగన్, చంద్రబాబు రాయలసీమ ద్రోహులు అన్నారు. ఈ ముగ్గురి పాలనలో రాయలసీమకు నవ మోసాలు జరిగినట్లు చెప్పారు. సంజీవిని లాంటి ప్రత్యేక హెూదా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి అమలు చేయలేదని మండిపడ్డారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాలేదని తెలిపారు. దుగరాజట్నం ఓడరేవు ఊసే లేదని విమర్శించారు. మన్నవరం విద్యుత్ పరికరాల ప్రాజెక్టు మూతపడిందని చెప్పారు. కడప - మదనపల్లి - బెంగళూరు నూతన రైలు మార్గం పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయం ఏర్పాటు కాలేదని అన్నారు. రాజధాని, హైకోర్టులలో ఒకటి కూడా రాయలసీమకు రాలేదని చెప్పారు. తెలుగుగంగ, గాలేరు- నగరి, హంద్రీనీవా సాగునీటి ప్రాజెక్టులు నత్త నడకన సాగుతున్నాయని వాపోయారు. తెలంగాణ ప్రభుత్వం కృష్ణానదిపైన అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ సాగునీటి ప్రాజెక్టులను కూడ అడ్డుకోవడం లేదని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో రాష్ట్రానికి, రాయలసీమకు ద్రోహం చేస్తున్న దుష్టత్రయ పార్టీలను చిత్తు చిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

సమన్వయ కమిటీ కన్వీనర్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీబలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త గట్టి కృషి చేయాలని కోరారు. పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాలు మేరకు ప్రతి నియోజకవర్గంలో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు పార్టీ బలోపేతంపై సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం చేపట్టే ఆరాచకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రాష్ట్రంలో అసమర్థత పాలన కొనసాగుతున్నట్లు చెప్పారు. కాంగ్రెసు ప్రభుత్వం పాలనలోనే ప్రజలకు మేలు జరిగిందని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో అధికారంలో వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి ప్రతి కార్యకర్త కాంగ్రెస్ విజయం కోసం పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ధ్రువకుమార్ రెడ్డి, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, నరసింహారెడ్డి, తిరుపాల్ రెడ్డి, శ్రీకాంత్, మహేంద్ర, మధు, సుబ్రమణ్యం, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కడప-బెంగళూరు రైల్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లా వాసి ముఖ్యమంత్రిగా ఉన్నా రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని కడప - బెంగళూరు రైల్వే లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా టిడిపి అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడప - బెంగళూరు రైల్వే లైనుకు సంబంధించి కడప నుంచి పెండ్లిమర్రి వరకు లైన్ పూర్తి చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వే లైన్ పనులు పడకేశాయన్నారు. కడప- బెంగుళూరు రైల్వే లైన్‌కు 250 కిలోమీటర్ల మీద దాదాపు రూ.3 వేల కోట్లు అంచనా వేశారని



మాట్లాడుతున్న లింగారెడ్డి

50 శాతం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రైల్వే లైన్ మీద దృష్టి పెట్టకపోవడంతో మరుగున పడిపోయిందన్నారు. రైల్వే లైను ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ,అతి తక్కువ సమయంలో బెంగళూరుకు రాకపోకలు సాగించవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దుబారా ఖర్చు తగ్గించి 50 శాతం డబ్బులు చెల్లిస్తే రైల్వేలైను పూర్తి చేస్తారన్నారు. ముద్దనూరు నుంచి పులివెందుల, ముదిగుబ్బ, సత్యసాయి జిల్లా మీదుగా కేవలం 165 కిలోమీటర్ల దూరంలో బెంగళూరుకి లింకు ఏర్పడుతుందన్నారు. విషయమై కేంద్ర,రాష్ట్ర రైల్వే అధికారులతో కలిసి ఫిర్యాదు చేస్తానన్నారు.

రైతులు, కూలీలను ఆదుకోండి

- మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రప్రభుత్వం రైతులను, కూలీలను ఆదుకోవాలని టిడిపి నాయకులు,మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలో మరి ముఖ్యంగా జిల్లాలో ఇప్పటివరకు చినుకులేని కారణంగా రైతులు భూమిలో విత్తనాలు వేయలేదన్నారు. పైరులేని కారణంగా రైతు కూలీలకు వ్యవసాయ పనులు లేని కారణంగా రైతుకూలీలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ఉపాధి కూలీలకు శాపంగా మారిందన్నారు. జూన్ 16 నుంచి ఇప్పటి వరకు 9 వారాలుగా ఒక వారం డబ్బులు కూడా చెల్లించలేదన్నారు. మహిళా కూలీలు డ్వాక్రా డబ్బులు కట్టలేకపోతున్నారన్నారు. పిల్లలు ఫీజులు కట్టేందుకు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. జూలైలో కేంద్రప్రభుత్వం ఉపాది హామీ పథకంకు సంబంధించి రూ. 400 కోట్ల వరకు నిధులు విడుదల చేస్తే ఒకరోజు వేతనం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. డ్వామా పీడీ మాత్రం ఎప్పటి పనులకు అప్పుడు డబ్బులు చెల్లిస్తున్నామని చెబుతున్నారని కానీ వాస్తవానికి కూలీలకు ఒక్క రూపాయి కూడా అందడం లేదని చెప్పారు. జిల్లాలో సుమారు 3,38,558 మంది కూలీలకు ఇప్పటి వరకు రూ. 9 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడినారాయణరెడ్డి

పెడింగ్ బకాయిలున్నాయని పేర్కొన్నారు. రైతులకు సైతం ప్లాంటేషన్, హార్టికల్చర్‌కు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల వల్ల 100 పని దినాలను అదనంగా 50 రోజుల పెంచి కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. కనీసం వినాయక చవితి పండుగైన సంతోషంగా జరుపుకునే విధంగా రావాల్సిన బకాయలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసింహారెడ్డి, హనుమంతు నాయక్, శ్రీనివాసులు రెడ్డి, రాజారెడ్డి, మల్లారెడ్డి, ఆలీ, రామిరెడ్డి, శ్రీనివాసులు, చెన్నయ్య, నరసయ్య, పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సర్పంచులకు సహకరించాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కడపలో సజ్జలను మర్యాదపూర్వకంగా కలిసి ఈ



సజ్జలతో మాట్లాడుతున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

మేరకు విన్నవించారు. 15వ ఫైనాన్స్ నిధుల సద్వినియోగానికి సర్పంచులకు అవకాశం కల్పించాలని కోరారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై సజ్జల సానుకూలంగా స్పందించారు. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లి పరిధిలోని 13వ వార్డు స్థానానికి నిర్వహించిన ఉప ఎన్నికలో కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి విజయం సాధించడంపై సజ్జల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొని రెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని ఆయన అభినందించారు. వార్డు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఏపుగా పెరిగిన కంపచెట్లు.. విద్యార్థులకు ఇక్కట్లు



పాఠశాల రహదారిని కప్పేసిన కంపచెట్లు

ప్రజాశక్తి- ముద్దనూరు

ముద్దనూరు నుండి చెన్నారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో కంపచెట్లు ఏపుగా పెరిగి రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా వ్యాపిస్తున్నాయి. ఈ దారిలో బాలికల ఉన్నత, ప్రాథమిక, ప్రయివేట్ పాఠశాల లున్నాయి. పాఠశాల పక్కనే ఉన్న రోడ్డుకు ఇరు వైపులా కంప చెట్లు ఏపుగా పెరగడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. పాఠశాల ప్రహరీ పక్కన కంపచెట్లు పెరగడంతో పరిశుభ్రత లోపించిందని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం గ్రామం నుండి ముద్దనూరుకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో మళ్లీ గ్రామానికి వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



ఆస్పత్రిలో తనిఖీ చేపడుతున్న ఆర్‌డి అనిల్‌కుమార్

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరగాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు చేయించుకుంటే వారికి నగదు నేరుగా వారి అకౌంట్లలోనే జమ చేస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఆపరేషన్ లేకుండా సాధారణ కాన్పులు అయ్యేలా వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. రక్తహీనత ఉన్న గర్భిణులను గుర్తించి ఖరీదైన మందులు ఉచితంగానే ప్రభుత్వం సరఫరా చేసి రక్తం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసి డాక్టర్ రాఘవేంద్రరావు ప్రశంసించారు. ఆయన వెంట అడిషనల్ డైరెక్టర్ భక్తవత్సలం పాల్గొన్నారు.

31న సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట

పులివెందుల రూరల్ : జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో స్టేషన్, పులివెందుల స్టేషన్ పరిధిలో నాటుసారా కేసులో పట్టుబడిన వాహనాలకు ఈనెల 31న ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ రామాంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో మొత్తం డబ్బులతోపాటు జిఎస్‌టి కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

చింతకొమ్మదిన్నె: స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న 'అమెజాన్, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అనే అంశంపై వృత్తినైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ప్రారంభమైన శిక్షణలో సుమారు 400 మంది దేశ, విదేశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సాంకేతికతను అందిపుచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సి.వి. సుబ్బయ్య, కన్వీనర్, కో-ఆర్డినేటర్ నరేష్ పాల్గొన్నారు.

సిఎంను కలిసిన వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ వివేక్

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



సిఎంతో వివేక్

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని 26 జిల్లాల సోషల్ మీడియా కన్వీనర్లు కలిశారు. కడప జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వివేక్ కూడా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి ముఖ్యమంత్రికి పూల బోకే అందజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా సోషల్ మీడియా విభాగం పని చేయాలని పార్టీ ముఖ్యమంత్రి కోరారు. రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా పరిధిని, ఆవశ్యకతను జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు విస్తృతం చేసే దిశగా దిశా నిర్దేశం చేశారని అని వివేక్ అన్నారు. పార్టీ కార్యక్రమాలతో పాటు, ఇప్పటివరకు ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేలా పనిచేయాలని కోరారు.

మినుము, జొన్న విత్తనాల కోసం ప్రతిపాదనలు


చాపాడు : మండల పరిధిలో ఆరుతడి పంటలు సాగు చేపట్టే రైతుల కోసం మినుము, జొన్న విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 8వందల క్వింటాళ్ల మినుము, 3వందల క్వింటాళ్ల జొన్న విత్తనాలు అవసరమని కోరామన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా కేసి కాలువకు నీటి విడుదల ఆలస్యం అవుతుందన్నారు. దీంతో వరి పంట సాగు తగ్గే అవకాశం కనిపిస్తుందన్నారు. ముందు జాగ్రత్తగా విత్తనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రైతుల అభ్యర్థన మేరకు మరిన్ని విత్తనాలు అవసరమైతే అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు ఆర్‌బికెలలో ఇప్పటికే సిద్ధంగా ఉంచామని తెలిపారు.

శ్మశాన స్థల మంజూరుపై హర్షం

ఖాజీపేట : శ్మశాన స్థలం ఏర్పాటుపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందిం చడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బిసి కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం మన్నా చర్చి పాస్టర్ పుష్పలత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు స్థానికులు శ్మశాన ఏర్పాటుకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంటనే స్పందిస్తూ అధికారులనే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యేను మైదుకూరు నియోజకవర్గ సమన్వయ కర్త నాగిరెడ్డిని, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగారెడ్డిని పాస్టర్ పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో బిషప్, ఎబినేజర్ పాస్టర్ పాస్టర్‌శేఖర్, మురళి, రాష్ట్ర మాల మహానాడు నాయకులు గున్నంపాటి వెంకటరమణ, సిఐటియు మండలఅధ్యక్షులు పుల్లూరు నారాయణ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పుల్లూరు మహేష్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కో-కన్వీనర్ వెంకటరమణ, స్థానికులు పాల్గొన్నారు.

గిరిజనులకు మొండిచేయి

ప్రజాశక్తి - వేంపల్లె



చంద్రబాబుకు గిరిజనుల సమస్యలు విన్నవిస్తున్న రవికుమార్

గిరిజనులకు భూ పంపిణీ చేయడంలో వైసిపి ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని టిడిపి ఎస్టీ సెల్ కడప పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఉన్న టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును ఆయన కలిసి గిరిజనుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలన అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్ల కాలంలో గిరిజన అభివృద్ధి పూర్తిగా మరుగున పడిందని చెప్పారు. గిరిజనులు నివసించే ప్రాంతాలలో మౌలిక సౌక ర్యాలను మెరుగుపరచక పోవడంతో అభివృద్ధికి దోహదపడే సంక్షేమ పథకా లన్నీ వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని వాపోయారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు భూమి లేని గిరిజనుల కోసం ఎకరం, రెండు ఎకరాల చొప్పున భూ పంపిణీ చేసేందుకు భూమి కొనుగోలు పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూమి కొనుగోలు పథకాన్ని రద్దు చేసిందని విమర్శించారు. సేకరించిన భూములను సైతం పంపిణీ చేయలేదని వాపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత భూ పంపిణీ చేయాలని ఆయన చంద్రబాబునాయుడును కోరారు. స్పందించిన చంద్రబాబు 2024లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూము లను సేకరించి గిరిజనులకు అమలు చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.